క్లుప్తంగా

సవరణలకు రెండు రోజుల గడువు

రాయచోటి టౌన్ : జవహర్ నవోదయ విద్యాలయాల ప్రవేశ పరీక్షల 2023–2024 సంవత్సరానికి దరఖాస్తుల గడువు ఈ నెల 15వ తేదీతో ముగిసింది. వీటికి సంబంధించి పొరపాటులను సవరించుకోవడానికి 16, 17వ తేదీలలో గడవు ఇచ్చినట్లు అన్నమయ్య జిల్లా మదనపల్లె నవోదయ పాఠశాల ప్రిన్సిపల్ కె. సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం కొడిదిపల్లె గ్రామంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించినట్లు మానవత చైర్మన్ జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ముల్లంగి నారాయణశెట్టి, లీలావతమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుల ఆర్థిక సౌజన్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గౌరవ డైరెక్టర్ రెడ్డప్పరెడ్డి, ఏపీ విద్యా కమిటీ చైర్మన్ గోపి, మానవత సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూఎస్ మహాసభల పోస్టర్ విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఈఓ, ఏపీయూఎస్ నాయకులు

రాయచోటి టౌన్ : ఏపీయూఎస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) రాష్ట్ర మహాసభల పోస్టర్లను జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి విడుదల చేశారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ మార్చి 5, 6వ తేదీలలో నెల్లూరులో మహా సభలను నిర్వహిస్తామని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయక అధ్యక్షుడు రామాంజులరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుమతి, రెడ్డి ప్రసాద్, మహిళా కన్వీనర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

లిప్ కార్యక్రమం పరిశీలన



మాట్లాడుతున్న వసంత

చిట్వేలి : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రొగ్రామ్(లిప్)ను స్టేట్ రీసోర్స్ పర్సన్ వసంత బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో అమలవుతున్న లిప్ కార్యక్రమాన్ని పరిశీలించారు. 6,7,8 వ తరగతులను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయులకు సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థులకు టీచింగ్ పిరియడ్స్‌తోపాటు ప్రాక్టీస్ పిరియడ్స్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్పీలు హరనాథ్, రాజశేఖర్, సీఆర్పీలు ధర్మేంద్రగౌడ్, చంద్ర, రాజేష్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

సిద్దవటం : మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాధర్‌వలీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణుల నమోదు ముఖ్యంగా వంద శాతం ఆర్‌సీహెచ్‌లో చేయాలని, హైరిస్క్ గర్భిణులను, ఈనెలలో డెలివరీ అయ్యేవారిని కడప రిమ్స్ వైద్యశాలకు పంపించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పుట్టిన పిల్లలనూ వంద శాతం నమోదు చేయాలని వైద్యాధికారి డాక్టర్ శివకుమార్‌కు తెలియజేశారు. 0- 5 సంవత్సరాలలోపు ఉన్న పిల్లలందరికి టీకాలు వేయించాలని సూచించారు. ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో అందరూ హాజరు వేశారా లేదా అని పరిశీలించారు.

నేడు శ్రీ నాగుల వార్షికోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం ఫైర్‌స్టేషన్ ప్రాంగణంలోగల నాగులకట్ట 27వ వార్షికోత్సవం గురువారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు అభిషేకం, గణపతిపూజ, నవగ్రహ పూజ, సర్వశాంతి హోమం నిర్వహించనున్నారు.

వైభవం.. వీరభద్రుని బ్రహ్మోత్సవం



పెనగలూరు: నారాయణ నెల్లూరులో నూతనంగా నిర్మించిన మూలస్థానేశ్వరస్వామి ఆలయం



రాయచోటి టౌన్: బ్రహ్మోత్సవాల సందర్భంగా విన్యాసాలు చేస్తున్న వీరశైవులు

రాయచోటి టౌన్ : మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు రాయచోటి పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో వైభవంగ ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు అన్ని వసతులు చేశారు. ఆలయాన్ని రంగు రంగుల పూలతో అలంకరించారు. దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు.

మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో మహా సంప్రోక్షణ

పెనగలూరు : మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామంలో వెలసిన కామాక్షమ్మ మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి మహాసంప్రోక్షణ, ధ్వజస్థంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం గోపూజ, రక్షాబంధనం, గణపతిపూజ, ఏకాదశ రుద్రాభిషేకం, మూలయంత్ర జపాలు, మంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశామన్నారు. అలాగే గురువారం (నేడు) ఉదయం 8 గంటలకు ప్రాతఃకాల పూజలు, విగ్రహ ధ్వజ యంత్రాభిషేకం, 8.30 గంటల నుంచి 9.30 గంటలలోపు ధ్వజప్రతిష్ట కార్యక్రమం, ఛండీ హోమం, వేదపారాయణం ఉంటాయన్నారు. 17వ తేదీన ఏకాదశ రుద్రాభిషేకం, ప్రాణ ప్రతిష్ఠ, ప్రధాన పరివార దేవతలకు అభిషేకం, హోమాలు, మహాబలిపూజ, పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, మంగళహారతి ఉంటాయన్నారు. 18వ తేదీన ఉదయం 10.30 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం మహా అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలు మధ్య ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేస్తాం



సిద్ధవటం: నిత్యపూజస్వామి సన్నిధిలో తహసీల్దారు శంకర్‌రావు, అధికారులు

సిద్ధవటం : అధికారుల సమన్వయంతో నిత్యపూజ స్వామి కోనలో మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేస్తామని తహసీల్దారు శంకర్‌రావు తెలిపారు. బుధవారం ఆలయం వద్ద చేస్తున్న ఏర్పాట్లను తహసీల్దార్, ఇతర అధికారులతో పరిశీలించారు. తహసీల్దారు మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. కాలినడకన రహదారి గుండా నడుచుకుని వెళ్లే భక్తులకు రహదారిలో ఉన్న పెద్ద పెద్ద రాతి గుండ్లను తొలగించామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచలింగాల వద్ద మెడికల్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నామన్నారు. జనరేటర్ల సహాయంతో విద్యుత్ సౌకర్యం, నీటి సౌకర్యం, పారిశుధ్యం కార్యక్రమాలు, వాహనాల రాకపోకల్లో ట్రాఫిక్ అంతరాయం వాటిల్లకుండా ఎస్ఐ తులసీ నాగప్రసాద్‌తో చర్చించారు. కార్యక్రమంలో ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ పాటూరు కొండారెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ జయచంద్ర, వంతాటిపల్లె, జ్యోతి పంచాయతీల కార్యదర్శులు, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని కార్మికురాలికి తీవ్రగాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం పట్టణంలో జరిగింది. చలపతిరావుకాలనీకి చెందిన లక్ష్మీదేవి (32) ఉదయం విధులకు వెళుతుండగా టౌన్‌బ్యాంక్ సర్కిల్ వద్ద ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు రాయితీ ప్రయోజనాలు

కలకడ : రైతులకు రాయితీ ప్రయోజనాలు అందించే బాధ్యత ఆర్‌బీకే సిబ్బందిపై ఉందని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు హరినాథరెడ్డి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోన పంచాయతీ గంగిరెడ్డిగారిపల్లె, తిప్పిగారిపల్లె, హరిజనవాడ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట నమోదు వివరాలు, బయోమెట్రిక్ తీసుకుంటున్న ఆర్‌బీకే ఏఈఓ అక్రంబాషాను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పంచాయతీలోని ప్రతి సాగు చేసిన పంట వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు.

మొదటి ప్రాధాన్యతా ఓటును వేయండి

ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి



వెన్నపూస రవీంద్రారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

సిద్ధవటం : పట్టభద్రులు మీ మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి, వేయించి గెలిపించాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. మండలంలోని మాధవరం-1లో ఉన్న హ్యాపీకిడ్స్ హైస్కూల్‌కు బుధవారం ఆయన ప్రచారానికి విచ్చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంటు అనీల్‌కుమార్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. పలువురు విద్యాసంస్థల అధినేతలు కొన్ని సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని వాటిని తప్పకుండా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ప్రవేటు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అమ్మఒడి పథకాన్ని రాష్ట్రస్థాయిలో ప్రైవేటు పాఠశాలలకు ఇవ్వడం వంటి ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తన గెలుపునకు కృషి చేయాలని రవీంద్రారెడ్డి కోరారు. పాఠశాల కరస్పాండెంట్ అనీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రైవేటు పాఠశాలలు అమ్మ ఒడితో ఒక రూపు దిద్దుకున్నాయన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏ రాష్ట్రంలో ఇవ్వని ఈ పథకం మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారన్నారు. పాఠశాలలోని పట్టభద్రులందరూ వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి, వేయించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబులెన్స్ డ్రైవర్‌కు ఆర్థికసాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : రాయచోటి మదీనా మజీద్ అంబులెన్స్ డ్రైవర్ ప్రమాదంలో గాయపడిన సమీవుల్లా (సమీ) వైద్యం ఖర్చుల కోసం రాయచోటి బంగారు షాపుల యజమానుల అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. బుధవారం బాధితుడి ఇంటికి వెళ్లి రూ.78,500ల మొత్తాన్ని మత గురువు హాజీ చేతుల మీదుగా అందజేశారు కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షుడు ఎం.ఇర్షాద్‌ఖాన్, గౌరవాధ్యక్షుడు కె.ఖాదర్ బాషా, ఎస్.అల్లబకాష్, సయ్యద్ అబూబకర్, జానకీరాం పాల్గొన్నారు.

రాయచోటి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో..

రాయచోటి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో అంబులెన్స్ ప్రమాదంలో గాయపడిన బాధితుడు సమీవుల్లాకు రూ.38,000లు బుధవారం ఆయన ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో ముక్తియార్, ఆరీఫ్, అంజద్, షాన్‌వాజ్, షాహుల్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

జిన్నా సేవా సంస్థ..

రాయచోటి మదీనా మజీద్ అంబులెన్స్ డ్రైవర్ సమీవుల్లాకి రాయచోటి జిన్నా సేవా సంస్థ అధ్యక్షుడు జిన్నా షరీఫ్ ఆర్థికసాయం అందించారు. బుధవారం ఆయన ఇంటిలో విశ్రాంతి తీసుకొంటున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు.

మల్లయ్యకొండకు 20 ఆర్టీసీ బస్సులు



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె: మహాశివరాత్రి పర్వదినాన ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం 20 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ(డీపీటీవో) అధికారి జగదీష్ తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్ మల్లిరెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, మదనపల్లె వన్‌డిపో డీఎం వెంకటరమణారెడ్డి, సీఐ రేవతి, స్థానిక ఎస్ఐ రామక్రిష్ణారెడ్డిలు ఆర్టీసీ బస్సు ట్రైల్ రన్ నిర్వహించారు. బస్సుల రాకపోకలు, బస్సులు నిలిపే స్థలాలు పరిశీలించారు. కొండపై పూజారి ఈశ్వరప్ప బస్సులకు ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రిరోజు కొండకింద నుంచి కొండపైకి 20 బస్సులు, మదనపల్లె నుంచి మల్లయ్యకొండ కింద వరకు 15 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొండ కింద నుంచి కొండపైకి రూ.40లు భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో లాభాలు



పొలంబడి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

పీలేరు : రైతులు పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయితీ మొరవవడ్డిపల్లె వద్ద పొలంబడి కార్యక్రమంలో చేపట్టిన పంటల సాగును ఆమె పరిశీలించారు. ఆర్‌బీకే సిబ్బంది పొలంలో చేపట్టిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రయోగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధికారులు, సిబ్బంది ఇచ్చే సూచనలను రైతులు పాటిస్తూ పంటలు సాగు చేయడం వల్ల పలు ప్రయోజనాలు ఉంటాయన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి సాగు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో పంట ఆరోగ్య కరంగా అధిక దిగుబడులు వస్తుందని తెలిపారు.

చిరుధాన్యాల సాగుతో అధిక ఆదాయం

మదనపల్లె : చిరుధాన్యాల సాగును చేపట్టడం ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని ఏఓ నాగప్రసాద్ అన్నారు. మండలంలోని కోటవారిపల్లె గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మేలు జరిగేలా విధులు నిర్వహించండి

అధికారులకు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి సూచన



మాట్లాడుతున్న మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : ప్రజలకు మేలు జరిగేలా అధికారులు విధులు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులతో భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలు చేయడంలో అధికారులు తమ పనితీరును వేగవంతం చేయాలన్నారు. మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకారం పుష్కలంగా ఉండాలన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగే విధంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం మండల స్థాయిలో పూర్తిగా అమలు చేయాలన్నారు. మండల పరిషత్ ద్వారా శాశ్వత అభివృద్ధికే పెద్దపీట వేస్తామన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రజల ముంగిటకే పాలనను తీసుకెళ్లిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా సెక్రటరీ సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షులు నాయనపల్లె అనుదీప్, తుమ్మల భావనశ్రీధర్‌గౌడ్, మండల కో-ఆప్షన్ సభ్యుడు కలీం, ఎంపీటీసీలు సుభాన్, సోమిశెట్టి సునీతాప్రభాకర్, పణతల రాజేశ్వరీ, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, లేబాక నరసయ్య, ఎంపీడీఓ సౌభాగ్య, తహసీల్దారు ఉదయశంకర్‌రాజు, ఇన్‌చార్జి ఎంఈఓ జయవేలు, ఈఓపీఆర్డీ ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి నడివీధి సుధాకర్, వైద్యాధికారి డా.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై రిలేదీక్షలు



మాట్లాడుతున్న నాగేశ్వరి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం 24వతేదీన కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలను చేపట్టనున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్, కో-కన్వీనర్‌లు నాగేశ్వరి, సరోజమ్మ లు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లాస్థాయి అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర- రాష్ట్రప్రభుత్వాల నిర్లక్ష్యంతో అంగన్‌వాడీల సమస్యలు దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్రప్రభుత్వం కుట్రపన్నుతోందని ఆరోపించారు. రిలేదీక్షలకు అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ వారు విజ్ఞప్తి చేశారు

పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీల జీతాలు, బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.చంద్రశేఖర్, ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలోని ఐసీడీఎస్‌లో ఇన్‌చార్జ్ పీడీ పాలన కొనసాగుతోందన్నారు. కేంద్రాల నిర్వహణ, ఉద్యోగుల పనితీరు గాడినపడాలంటే రెగ్యులర్ పీడీని నియమించాలంటూ డిమాండ్ చేశారు. వివిధ అంగన్‌వాడీ కార్యకర్తలకు పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలన్నారు. అంగన్‌వాడీలకు అందుతున్న సరకుల సరఫరాలో అధికారులు, కాంట్రాక్టర్‌లు అవకతవకలకు పాల్పడుతున్న ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడాన్ని తప్పుబట్టారు. అంగన్‌వాడీలకు నాణ్యమైన సరకులు అందజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన ఎంఈఓ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ రంగనాథయ్య

పుల్లంపేట : మండలంలోని అనంతసముద్రం పంచాయతీలోని పుత్తనవారిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఎంఈఓ రంగనాథయ్య మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే ఉపాధ్యాయులు సమయం పాటించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని, విద్యార్థులు ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సూచించారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

వాల్మీకిపురం: శ్రీ షిరిడి సాయి బాబా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో స్విమ్స్ ఆసుపత్రి సహకారంతో గురువారం క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. మహిళల్లో సంక్రమించే గర్భకోశ వ్యాధులకు సంబంధించిన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉద్యాన కోర్సులకు ప్రాధాన్యత అధికం



జ్యోతి వెలిగిస్తున్న కె.గోపాల్, అవధాని మేడసాని మోహన్



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఫ్రెషర్స్ డే వేడుకలో వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్

రైల్వేకోడూరు : ఉద్యాన కోర్సులకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి అనేక రంగాల్లో ఉద్యోగ అవకాశాలున్నాయని అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.గోపాల్ తెలిపారు. బుధవారం అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో బీఎస్సీ ఉద్యాన కోర్సు మొదటి సెమిస్టర్‌లో చేరిన వారిని కళాశాలలోకి సాదరంగా ఆహ్వానిస్తూ సీనియర్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. అసోసియేట్ డీన్ డా.కె.గోపాల్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోనే కాకుండా ఇతర రంగాల్లోనూ ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని, విద్యార్థులు చక్కగా చదివి అవకాశాలు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యాన కోర్సులకు ఉన్న ప్రాధాన్యత, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. వ్యవసాయ రంగంలోనే కాకుండా బ్యాంకింగ్, నర్సరీ, ఫర్టిలైజర్స్, సీడ్ టెక్నాలజీ తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది 113 మంది బీఎస్సీ ఉద్యాన కోర్సులో అడ్మిషన్ పొందారన్నారు. ఏపీ నుంచే కాకుండా తెలంగాణ, బీహార్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ప్రవేశాలు పొందడం ఈ కోర్సులకు ఉన్న ప్రాధాన్యత వివరిస్తోందన్నారు. ఆత్మ విశ్వాసంతో ముందుకు నడవాలని, ఇతర రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు ప్రకృతిని ప్రేమించాలని, ప్రకృతిపై అధ్యయనం చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అవధాని డాక్టర్ మేడసాని మోహన్, రైల్వేకోడూరు సబ్‌డివిజన్ ఫారెస్ట్ అధికారి అనురాగ్ మీనా, ఉద్యాన వర్సిటీ పరిశోధన విభాగం రీజనల్ హెడ్ డాక్టర్ కెటీవీ.రమణ, ఓఎస్ఏ డాక్టర్ శ్యామ్ సుందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

వాహనాల వేలంలో రూ.6 లక్షల ఆదాయం

మదనపల్లె : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు తాలూకా పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో ప్రభుత్వానికి రూ.6లక్షల ఆదాయం వచ్చినట్లు టూ టౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. మొత్తం ఎనిమిది వాహనాలను వేలం వేయగా, పాటదారులు ఏడు ద్విచక్ర వాహనాలను జీఎస్టీతో కలిపి రూ.6,00,620లకు కొనుగోలు చేశారన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు వేలంలో వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమచేసినట్లు సీఐ తెలిపారు. నిబంధనలు పాటించని వాహనాల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. తాలూకా ఎస్ఐలు చంద్రశేఖర్, సుధాకర్, ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌కు ఆహ్వానం



కడప కల్చరల్ : జిల్లాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక రచయిత, రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర ఉపన్యాసకులు ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావును శ్రీశైలం క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా ప్రవచనం చెప్పేందుకు ఆహ్వానించారు. శ్రీశైలం క్షేత్రంలో శుక్రవారం సరస్వి పుష్కరిణి వేదిక వద్ద ఆయనను 'శివలీలలు' అంశంపై ప్రవచనం చెప్పాలని దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నుంచి ఆహ్వానం అందింది. రాష్ట్రంలోని దాదాపు అన్నీ ఆధ్యాత్మిక క్షేత్రాల గురించి భక్తులకు అందజేసిన పుస్తకాల రచయితగా, టీవీ, రేడియో వ్యాఖ్యాతగా ఐఎల్ఎన్ చంద్రశేఖర్‌రావు తెలుగు పాఠకులకు సుపరిచితులు.